సచివాలయ సేవలకు మంగళం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయాల్లో 545 రకాల సేవలు
- నేడు కీలక సేవలందక ప్రజల అవస్థలు
- తెరుచుకోని వెబ్‌సైట్లు
- ఆధార్‌లో మార్పుల కోసం విద్యార్థుల ఇబ్బందులు
- కూటమి సర్కార్ తీరుతో ప్రజల్లో అసహనం



ఎం.కృష్ణాపురం సచివాలయం


వెలవెలబోతున్న గోస్పాడు సచివాలయం

గోస్పాడు: గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యస్థాపనే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రజల చెంతకే సేవలందించాలనే ధ్యేయంగా గ్రామ సచివాలయాలను ఏర్పాటుచేసి గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారు. వీటికి అనుసంధానంగా వలంటీర్లను నియమించి ఇంటింటికీ వెళ్లి సేవలు అందించారు. అయితే కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే వలంటీర్లను పక్కన పెట్టేసింది. సచివాలయ ఉద్యోగులను కించపరిచేలా విధులను అప్పగిస్తూ సచివాలయాల్లో అందే సేవలన్నీ నిలిచిపోయేలా చేస్తుండటంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు

గత ప్రభుత్వ హయాంలో 545 రకాల సేవలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాల్లో ప్రజలకు 545 రకాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. వీటికి అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పాటు ప్రజలకు నిత్యం అవసరమైన సేవలను ఇంటి ముంగిటకే తెచ్చారు. గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉత్తమ సేవలందించారు. గోస్పాడు మండలంలో 12 సచివాలయాలు ఉండగా 134మంది సిబ్బంది, నంద్యాల మండలంలో 17 సచివాలయాల్లో 168 మంది సచివాలయ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఈ సచివాలయాల్లో ఉద్యోగులతో పాటు 500 మందికి పైగా వలంటీర్లు గతంలో ప్రజలకు సేవలందించేవారు.

అర్హులందరికీ పథకాలు..

గత ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రజల నుంచి నిత్యం దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు సచివాలయాలు పనిచేస్తూ ఉండేవి. సామాజిక పింఛన్లు, నివేశన స్థలాలు, బియ్యం కార్డులు, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, ఆటోవాలాలకు వాహనమిత్ర ఇలా పలురకాల సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తూ అర్హులకు పథకాలందించడంలో కీలకపాత్ర పోషించేవి. ఆయా సచివాలయాల పరిధిలో ఏపథకాన్ని ఎంత మందికి ఎంత సొమ్ము చెల్లించామనే వివరాలను స్పష్టంగా సచివాలయాల వద్ద బోర్డులు పెట్టి మరీ ప్రదర్శించే వారు, కానీ ఇప్పుడు అవి మచ్చుకకు సైతం కనిపించని దుస్థితి నెలకొంది..

ప్రజలకు తప్పని కష్టాలు

కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతోనే సామాజిక పింఛన్లు పంపిణీ చేయిస్తూ వారిని ఇంటింటికీ తిప్పుతున్నారు. ఇది మంచి ప్రభుత్వమంటూ ఇంటింటి ప్రచారం చేస్తూ స్టిక్కర్లు అంటించే పనులు చేయిస్తున్నారు. గత ప్రభుత్వంలో 545 రకాల సేవలకు సంబంధించి కంప్యూటర్లో నిక్షిప్తం చేసి ఆపై డాక్యుమెంటేషన్, అవసరమైన సర్టిఫికెట్ల జారీ చేసేవారు. ప్రస్తుతం జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు తప్ప మరి ఏ పథకానికి సంబంధించిన దరఖాస్తులు సచివాలయంలో చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలకు అత్యవసరమైన రేషన్ కార్డులు కానీ నూతన పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, నివేశన స్థలాలు తదితర పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ సైట్స్ ఓపెన్ కావడం లేదని వాపోతున్నారు. దీంతో మళ్లీ మండల కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించిందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అపార్ నమోదుకు ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం లేక విద్యార్థులు, తల్లిదండ్రులు పట్టణాల్లోని మీసేవ, పోస్టాఫీసు, ఇతర కార్యాలయాలకు వెళాల్సి వస్తోంది.

సేవలందక అవస్థలు



కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు గడిచినా సంక్షేమ పథకాల ఊసే లేదు. సచివాలయాల ద్వారా గత ప్రభుత్వం అందించిన సేవలను సైతం నిలిపి వేయడంతో పాటు ప్రజలకు నిత్యావసరమైన రేషన్ కార్డుల్లో మార్పులు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, కొత్తగా నివేశన స్థలాలకు దరఖాస్తు పెట్టుకునే అవకాశం లేకుండా పోయింది. సచివాలయాల ద్వారా ప్రజలకందే మెరుగైన సేవలకు ఆటంకం కలిగించకుండా చేయాలి.

– భీమలింగేశ్వరరెడ్డి, పసురపాడు

సచివాలయ సేవలను పునరుద్ధరించాలి



గత ప్రభుత్వంలో సచివాలయాల ద్వారా ఎన్నో సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేవి. అవసరాల నిమిత్తం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండానే వలంటీర్లతో ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలను అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాల యాల్లో సేవలేమీ అందించడం లేదు. ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉన్న సచివాలయాలను నిర్వీర్యం చేయడం మంచిపద్ధతి కాదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా గతంలోలాగే సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు కొనసాగించాలి.

– ఆర్థర్ సైమాన్, ఎంపీపీ, గోస్పాడు

సదరం సర్టిఫికెట్ కోసం నెలల తరబడి తిరగాల్సి వస్తోంది



నాకూతురు ఉషా (మెంటల్ రెటార్డేషన్) అంగవైకల్యంతో బాధపడుతోంది. అయితే గోస్పాడు గ్రామసచివాలయం ద్వారా జూలై నెల 6వ తేదీన సదరం క్యాంపునకు వెళ్లేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. అప్పట్లో ఉమ్మడి నంద్యాల, కర్నూలు జిల్లాలలో జరిగే సదరం క్యాంపు కాకుండా మాకు జూలై 23వ తేదీ మార్కాపురం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జరిగే సదరం క్యాంపునకు వెళ్లాలని రిసిప్ట్‌లో వచ్చింది. ఆరోజు అక్కడికి వెళ్లినా సదరం క్యాంపులో డాక్టర్ రాలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు సచివాలయం చుట్టూ తిరుగుతున్నా మాగోడు విని ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. తిరిగి సదరం క్యాంపునకు వెళ్లాలంటే గతంలో నమోదైన రిసిప్ట్ నంబర్ కనిపిస్తుండటంతో రిజిష్టర్ చేసేందుకు కూడా వీలుకావడంలేదు. మాలాంటి పేదవారికి కష్టాలు తీర్చేవారే లేరా?.

– నడిపి ఉసేని, దివ్యాంగురాలు గుళ్లదుర్తి ఉష తండ్రి, గోస్పాడు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గోపాష్టమి


గోవులను పూజిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఎస్‌బీఐ కాలనీలోని వెలసిన బృందావన గోశాలలో గోపాష్టమిని పురస్కరించుకొని గోవులకు ప్రత్యేక పూజలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవులకు వేదపండితుల ఆధ్వర్యంలో ఒడి బియ్యం, ప్రత్యేక పూజలు నిర్వహించిన మహామంగళ హారతులు ఇచ్చారు. నిర్వాహకుడు బసవరాజు మాట్లాడుతూ గోవులలో సర్వదేవతలు కొలువై ఉంటారని, గోవులను పూజిస్తే పుణ్యం లభిస్తుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ జట్టుకు కోచ్‌ల నియామకం


కోచ్‌లతో డీఈఓ జనార్దన్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు జమ్ముకాశ్మీర్‌లో జరిగే అండర్–14 బాలుర ఫెన్సింగ్ జాతీయ క్రీడల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు కోచ్, మేనేజర్లను నియమించినట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జట్టు కోచ్‌గా మిడుతూరు మండలం చౌట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ ముస్తాహీర్, కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లును నియమించినట్లు తెలిపారు.ఏపీకోచ్‌గా నియమితులైన వీరిద్దరిని స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ అభినందించారు.

కొత్తూరు దేవస్థానానికి అన్నదాన రథం

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ఎన్‌జీఓ కాలనీ వాసుల ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పాణ్యం మండలం కొత్తూరు సుబ్బరాయుడు దేవస్థానానికి శనివారం సాయంత్రం అన్నదాన రథం బయల్దేరింది. ఈ సందర్భంగా నిర్వాహకులు శంకర్‌రెడ్డి, గోవిందరెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో కొత్తూరు దేవస్థానంలో ఆదివారం 2వేల మందికి పైగా ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దాతల సహకారంతోనే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఆలయ ఈఓ రామకృష్ణ, ఆలయ అర్చకుడు నారాయణస్వామి సహకారంతో ఈ కార్యక్రమాన్ని దాదాపుగా నాలుగేళ్ల నుంచి నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మారంరెడ్డి జనార్దన్‌రెడ్డి, చింతకుంట్ల రవి, నారాయణరెడ్డి, సుబ్బయ్య, నగేష్, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉర్దూడే


ఉర్దూ భాష అభివృద్ధికి కృషి చేసిన వారిని సన్మానించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ఉర్దూ సాహిత్య కమిటీ కార్వాన్–ఏ ఉర్దూ ఆధ్వర్యంలో శనివారం నేషనల్ పీజీ కళాశాలలో ఉర్దూడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ డాక్టర్ నౌమాన్, ఎస్ఎండీ ఫిరోజ్ ముఖ్యఅతిథులు హాజరయ్యారు. వారు మాట్లాడు తూ ఉర్దూ ఆత్మీయత, అనురాగాలు పెంచే భాష అని అన్నారు. మంత్రి ఫరూక్ సహకారంతో నంద్యాలను ఉర్దూ హబ్‌గా మార్చడానికి తనవంతు సా యంగా కృషి చేస్తామన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి నింపిన భాష ఉర్దూనేనన్నారు. పట్టణంలో ఉర్దూ భాషాభివృద్ధికి ఎంతో కృషి చేసిన నేషనల్ కళాశాల చైర్మన్ డాక్టర్ ఇంతియాజ్ అహమ్మద్‌కు రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మకమైన ఉర్దూ ఐకాన్ బిరుదు ను అందజేశారు. అదే విధంగా ఉర్దూ భాషకు ఎంతో సేవలు అందించిన ఉపాధ్యాయులకు, కవులకు మెమొంటోలు,శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో షేక్ అబ్దుల్‌సమ్మద్, ఉర్దూ డిప్యూటీ డీఈఓ అస్మోద్దీన్, ఆఫీజ్ అహమ్మద్, తమీమ్, సయ్యద్ సలాముల్లా, బాషా, తదితరులు పాల్గొన్నారు.

అలగనూరు రిజర్వాయర్‌ను పూర్తి చేయాలి

మిడుతూరు: అలగనూరు రిజర్వాయర్ గండి నిర్మాణం పూర్తి చేసి రైతాంగానికి సాగునీరందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, జిల్లా సమితి సభ్యుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం మిడుతూరు, గడివేముల మండలాల పరిధిలోని గ్రామాల్లో జీపు జాత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అలగనూరు రిజర్వాయర్ గండి నిర్మాణం చేపట్టకుండా నాలుగు సంవత్సరాలు దాటిందని.. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి రిజర్వాయర్ గండికి మరమ్మతులు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా నందికొట్కూరు పట్టణానికి రిజర్వాయర్ ద్వారా తాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పెద్ద రాముడు, అబ్రహం, సోమన్న, బాషా పాల్గొన్నారు.

శివమాలధారుల 1008 ప్రదక్షిణలు


భైరవాలయంలో శివ మాలాధారులతో గురుస్వామి చలపతి

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన శివ భక్తుడు తుపాకుల చలపతితో పాటు గురుస్వామి జయరాముడు ఆధ్వర్యంలో 13 మంది భక్తులు 20 రోజుల క్రితం శివ మాల ధరించి దీక్ష చేపట్టారు. వీరు కార్తీక మాసం, శ్రావణా నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం తెల్లవారుజాము నుంచి ఉపవాస దీక్ష చేపట్టారు. గ్రామంలోని శ్రీభైరవేశ్వరాలయం చుట్టూ 1008 ప్రదక్షిణలు చేశారు. సుమారు 15 గంటల పాటు 60 కిలోమీటర్ల మేర సాయంత్ర 5 గంటల వరకు ప్రదక్షిణలు చేపట్టారు. శివ మాలాధారులు కార్తీక మాసంలో 45 రోజుల శివ దీక్ష పూర్తి చేసి శ్రీశైల మల్లన్నను దర్శించుకొని ఇరుముడి సమర్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో శివమాలధారులు కోటయ్య, నాగేంద్రబాబు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


స్నేహితురాలు పిల్లలకు నగదు అందించిన మిత్ర బృందం

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరం శ్రీకన్యకా పరమేశ్వరీ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (2006–07 పదవ తరగతి) స్నేహితురాలి పిల్లలకు అండగా నిలిచారు. రుద్రవరానికి చెందిన జయలక్ష్మి కొద్ది రోజుల క్రితం మృతి చెందింది. ఈ మేరకు పూర్వ విద్యార్థులు స్నేహితురాలి పిల్లల ఉపయోగార్థం సంరక్షకుడికి శనివారం రూ.50 వేలు అందజేశారు. పిల్లలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని మిత్ర బృందం అనిల్ గఫూర్, మస్తాన్, హుశేన్, బాలచౌడయ్య, పాములేటి, నరసింహ్మ, ఇడమడక జగన్, వెంకటరమణ, నాగేంద్ర, సురేంద్ర, చంద్రశేఖర్, కాశీం తదితరుల తెలిపారు.

ఆలయాల్లో కార్తీక పూజలు


సుద్దమల్లలో భక్తులకు హారతిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ: కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, అల్లూరు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మి నరసింహ కంబగిరిస్వామి, అభయాంజనేయస్వామి, లక్ష్మి వేంకటేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వాములకు భక్తులు వేకువజాము నుంచే అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కమలేష్‌శర్మ, లక్ష్మణస్వామి, అనంతయ్య, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్తీక మాసం పురస్కరించుకుని అల్లూరు గ్రామంలో జొన్న పులగం ఆహ్వానితులకు సామూహికంగా భోజనం వడ్డించారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


నంది విగ్రహం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగల పల్లె పొలిమేరలలో వెలసిన లక్ష్మి గోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. లక్ష్మీ గోదా సమేత వాసపురం వేంకటేశ్వర స్వామి, మహాత్రిపుర సుందరి, మానస లింగేశ్వరస్వామివారికి ఉదయాన్నే ఆలయ నిర్వాహకులు మధు సూధనరెడ్డి, రంగనాయకులు ఆధ్వర్యంలో అర్చకులు గోపీ శర్మ, శివ నిత్య పూజలు చేశారు. స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తాదులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు ఆలయ ప్రాంగణంలోని నాగుల కట్ట, నంది విగ్రహం వద్ద ప్రదక్షిణలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు.

వెంకటరమణను పరామర్శించిన గంగుల


వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని స్వగ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శనివారం వెంకటరమణ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గంగుల విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి పాటుపడిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. ఏ సమస్య వచ్చినా తమవంతు సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నపురెడ్డి జగదీశ్వరరెడ్డి, మనోహర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వ్యాపారవేత్తలు చక్రం షబ్బీర్ ఆహ్మద్, షేక్ నాయబ్‌రసూల్, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం , పార్టీ మండల అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, ఉప సర్పంచ్ షేక్ సోహెల్, ఎంపీటీసీలు పత్తి నారాయణ, లక్ష్మీరెడ్డి, తోడేండ్లపల్లె గ్రామ సర్పంచ్ గోవిందయ్య, శ్రీనివాసులు, మల్లారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామగుర్విరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

‘మోదీ ప్రభుత్వంలో దారిద్ర్యంలో దేశం’


మాట్లాడుతున్న రమేష్‌కుమార్

నంద్యాల(న్యూటౌన్): మోదీ ప్రభుత్వంలో అధిక ధరలు, నిరుద్యోగం, ఆకలి దారిద్ర్యంలో భారత దేశం 105వ స్థానంలో ఉందని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికి జమిలి ఎన్నికల సాకుతో ప్రజల మధ్య చీలిక తేవడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. శనివారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో సీపీఎం మహాసభను నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలతో బాగా మద్యం తాగించి లాభాలు పొందడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇసుక అందని ద్రాక్షలా మారిందన్నారు. సూపర్–6 పథకాలు ఏ మాత్రం అమలు చేయడం లేదన్నారు. అనంతరం మండల సీపీఎం ప్రధాన కార్యదర్శిగా బాలవెంకట్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులుగా రత్నమయ్య, రామయ్య, తిరుపతయ్య, నిర్మలమ్మ, వలి, యూసుఫ్, శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ న్యాయం అందితేనే సమానత్వం


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శైలజ

ఆళ్లగడ్డ: అందరికీ న్యాయం అందితేనే సమానత్వం సాకారమవుతుందని సీనియర్ సివిల్ జడ్జి శైలజ పేర్కొన్నారు. న్యాయ సేవల దినోత్సవ వేడకల్లో భాగంగా శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయ మూర్తి శైలజ మాట్లాడుతూ ప్రత్యేకమైన వివాదాలు పరిష్కరిస్తే నేరాలు తగ్గుతాయన్నారు. పేదలకు ఉచిత ంగా న్యాయం అందించడమే న్యాయసేవాధికార ము ఖ్య ఉద్దేశమన్నారు.ప్రజలకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని చైతన్యవంతం కావాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ చిరంజీవి, ఎంపీడీఓ మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ తస్లీమా సుల్తాన

చాగలమర్రి: ఫ్యామిలి డాక్టర్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముత్యాలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్ తస్లీమా సుల్తాన తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామ సచివాలయం–1లో శనివారం వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరం మేరకు రోగులకు ఉచితంగా డాక్టర్ తస్లీమా సుల్తాన మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ మనీషా, ఎఎస్ఎం శుభాషిణి, శ్రీలక్ష్మీదేవి, ఆశ వర్కర్లు రమాదేవి, పీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. వెయ్యిమంది పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ పాత స్నేహితులను కలుసుకొని కాలేజీ రోజుల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రాముడు, ప్రధాన కార్యదర్శి నాగమల్లేష్ రావు, వి.సత్యనారాయణ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, రిటైర్డు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, గౌరవ అతిథులు పాల్గొన్నారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు, ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ నంద్యాల పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ అందించడం , పూర్వ విద్యార్థులు అందించిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మద్దతుతో సాధ్యమైందన్నారు. 1960 నుంచి 2024 వరకు చదివిన పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం విశ్వాసానికి నిదర్శనమన్నారు.

ఓటరు నమోదు తప్పులు లేకుండా చేపట్టాలి


ఓటరు నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రత్నకుమారి


ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ అబ్దుల్ సత్తార్

ఆళ్లగడ్డ: ఓటరు జాబితాలో తప్పులు, అక్షర దోషాలు లేకుండా పేర్లు నమోదు అయ్యేలా బీఎల్వోలు శ్రద్ధ తీసుకోవాలని తహసీల్దార్ రత్నకుమారి తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన శిబిరాలను ఆమె తనిఖీ చే శారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఎలాంటి పొరపాట్లు జరిగినా బీఎల్వోలదే బాధ్యతని హెచ్చరించారు.

ఉయ్యాలవాడ : మండలంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి 31 దరఖాస్తులు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ బాబు తెలిపారు. 20 మంది పురుషులు, 11 మంది స్త్రీలు ఆయా పోలింగ్ కేంద్రాలలో బూత్‌లెవెల్ అధికారులకు దరఖాస్తులు అందజేశారని డీటీ చెప్పారు.

దొర్నిపాడు: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుభద్ర సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు వెంటనే తగిన ధ్రువపత్రాలను సమర్పించి బీఎల్ఓలకు ఇవ్వాలన్నారు. చనిపోయిన ఓటర్లు ఉంటే వెంటనే జాబితాలో తొలగించాలని ఆదేశించారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గోపాల్, జూనియర్ అసిస్టెంట్ చిన్నగోవిందు పాల్గొన్నారు.

చాగలమర్రి: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని ఆర్ఐ అబ్దుల్ సత్తార్ సూచించారు. మేజర్ గ్రామ పంచాయితీ చాగలమర్రి పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఆర్ఐ పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్ఓలు ఇమాంబాషా, సాయి, బీఎల్ఓలు ప్రసన్న, పరీ్వన్, ధరణి, మనోజ్, నరేష్‌రెడ్డి, బాషలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 11వ తేదీన జాతీయ విద్యాదినోత్సవాన్ని, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఐఎంఏ, నంద్యాల లయన్స్ క్లబ్ నిర్వహణలో విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం, సందేశం అన్న అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. పోటీల్లో ప్రతిభ చూపిన 200మంది విద్యార్థులకు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, అధ్యక్షుడు మధుసూదన రావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులు సాధించిన వారికి 11వ తేదీన జ్ఞాపికలు ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, పత్తి రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.